
యాడికి సమీపంలో సాగుకు సిద్ధం చేసిన పొలం




యాడికిలో వర్షం పడుతుందన్న ఆశతో కొర్ర విత్తనం వేస్తున్న రైతులు

రాష్ట్రమంతా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో ప్రాజెక్టులు పొంగిపొర్లుతున్నాయి. అక్కడి నుంచి రాష్ట్ర ప్రాజెక్టులకు వరద మొదలైంది. కానీ జిల్లాలో మాత్రం చినుకు జాడ కనిపించడం లేదు. ఆకాశం రోజూ మేఘావృతమౌతోంది. వర్షం వచ్చేస్తుందేమో.. అన్నట్లు ఊరిస్తుంది. కానీ హోరెత్తే గాలులకు మేఘాలు దూరంగా కొట్టుకుపోతున్నాయి. వరుణుడిపై భారం వేసి.. అరకొర వర్షానికే కొందరు విత్తనం వేశారు. మిగిలినవారు పొలాలను సిద్ధం చేసుకుని.. పదును వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. నాటిన విత్తనం మొలకెత్తి.. బతికి బట్టకట్టాలన్నా, సిద్ధంగా ఉన్న పొలాల్లో విత్తనం పడాలన్నా.. ఒక మంచి వర్షం జిల్లాకు అవసరం. ఆ రోజు కోసం.. ఆకాశం వైపు అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నేల రాలని చినుకు..!


యాడికి సమీపంలో కొర్ర పంట


యాడికిలో వాడిపోతున్న పత్తి పంట

- ఊరించి.. ఊరుదాటుతున్న మేఘాలు
- పదును వర్షం కోసం రైతుల ఎదురుచూపు
- ఆగస్టు 5 వరకే సాగుకు అదును
- ఇప్పటిదాకా 62 వేల హెక్టార్లలో పంటల సాగు
- విత్తుకోసం సిద్ధంగా మరో 2.84 హెక్టార్ల విస్తీర్ణం

అనంతపురం అర్బన్/యాడికి/ఉరవకొండ, జూలై 22

నీలి మేఘాలు ఊరిస్తూ ఉసూరుమనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఆకాశం మేఘావృతవుతున్నా వర్షం కురవడం లేదు. ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. గత నెలలో కురిసిన వర్షాలకు సేద్యం పనులు చేసుకున్నారు. పలు మండలాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. మరోమారు పదును వర్షం పడితే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ముందస్తుగానే, జూన్ 2న జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. పలు మండలాల్లో వర్షాలు పడ్డాయి. మే నెలలో ఆశించిన స్థాయిలో వర్షం పడకపోవడంతో ఎక్కువ శాతం పొలాల్లో సేద్యం పనులు చేసుకోలేకపోయారు. దీంతో గత నెలలో పడిన వర్షాలకు సేద్యం పనులు పూర్తి చేసుకొని మరోసారి పదును పడితే విత్తనం వేసేందుకు సిద్ధమయ్యారు. ఇదివరకే సాగు చేసిన పత్తి, కొర్ర పంటలు వాడు దశకు చేరుకుంటున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం పడింది. ఉరవకొండ, నార్పల, రాయదుర్గం, పెద్దవడుగూరు, డి. హిరేహాళ్, పామిడి, గుత్తి, కణేకల్లు, విడపనకల్లు, బొమ్మనహాళ్, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో కేవలం 1.8 మి.మీ. నుంచి 3.8 మి.మీ. దాకా వర్షపాతం నమోదైంది.

ఆగస్టు 5 వరకే అదును

వేరుశనగ, కంది, ఆముదం, పత్తి ఇతర రకాల పంటలను సాగు చేసేందుకు ఆగస్టు 5వతేదీ వరకే అదును సమయమని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఆ తర్వాత పంటలు సాగు చేసినా ఆశించిన స్థాయిలో దిగుబడులు రావన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 5వ తేదీ దాకా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం కావాల్సిందే. జూన్ సరాసరి సాధారణ వర్షపాతం 61.0 మి.మీ. కాగా ఈ ఏడాది 147.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. గత ఏడాది జూన్ మాసంలో 45.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ నెల సరాసరి సాధారణ వర్షపాతం 63.9 మి.మీ. కాగా ఇప్పటి దాకా 15.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. గత ఏడాది జూలై మాసంలో 73.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జూన్ నెలలో సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదైనప్పటికీ పంటలు సాగు చేయలేకపోయారు. మే నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో జూన్ నెలలో దుక్కులు దున్ని సేద్యం పనులు చేసుకునేందుకే సరిపోయింది.

అంతటా ఎదురుచూపులే..

- యాడికి మండలంలో 9,865 హెక్టార్లకుగానూ ఇప్పటివరకు 2,388 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగుచేశారు. ఇందులో కొర్ర 176 హెక్టార్లు, కంది 233, సజ్జ 52, ఆముదం 130, పత్తి 998, మొక్కజొన్న 627, వేరుశనగ 172 హెక్టార్లు ఉన్నాయి. ఈ ఖరీఫ్‌లో 25 శాతం విస్తీర్ణంలో మాత్రమే విత్తనం పడింది. అదీ అరకొర పదునులో విత్తు వేయడంతో సరిగా మొలకెత్తలేదు. మొలకెత్తిన చోట వర్షాలు లేక పెరుగుదల ఆగిపోయింది. రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉంది.
- ఉరవకొండ డివిజన్‌లో జూన్‌లో భారీ వర్షాలు కురిశాయి. ఆ నెలలో సాధారణ వర్షపాతం 77 మి.మీ. కాగా.. ఏకంగా 188 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆ తరువాత నెలన్నర నుంచి వర్షాలు లేవు. ఉరవకొండ వ్యవసాయ డివిజన్‌లో విడపనకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, గుంతకల్లు మండలాలు ఉన్నాయి. ఇక్కడ 52 వేల హెక్టార్లలో వర్షాధారం కింద పంటలు సాగు అవుతాయి. వేరుశనగ, ఆముదం, పత్తి, కంది పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. రైతులు పొలాలను సిద్ధం చేసుకున్నారు. విత్తనాలు, ఎరువులను తెచ్చిపెట్టుకున్నారు. జూన్‌లో కురిసిన వర్షాలకు కంది 3,367 హెక్టార్లు, వేరుశనగ 4,517 హెక్టార్లు, ఆముదం 399 హెక్టార్లలో సాగు చేశారు. ఇవన్నీ ఎండిపోతున్నాయి. భూమిలో తేమశాతం తగ్గడంతో పంట ఎదుగుదల ప్రశ్నార్థకంగా మారింది.

62 వేల హెక్టార్లలో సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.97 లక్షల హెక్టార్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటి దాకా 62వేల హెక్టార్లల్లోనే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 26వేల హెక్టార్లు, కంది 13వేలు, పత్తి 12,770, మొక్కజొన్న 3వేలు, సజ్జ 765, కొర్ర 739, ఆముదం 3,995 హెక్టార్లల్లో సాగయ్యాయి. మిగతా విస్తీర్ణంలో జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్, పెసలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలు సాగయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి 61వేల హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 24వేల ఎకరాల్లో సాగైంది. గతేడాది ఖరీఫ్ తరహాలోనే ఈసారి వర్షాభావంతో ఆశించిన స్థాయిలో పంటలు సాగు కావడం లేదు. మరో 2.84 హెక్టార్ల విస్తీర్ణంలో విత్తనం పడాల్సి ఉంది.


చిన్నముష్టూరు సమీపంలో ఎదుగుదలలేని కంది పంట

● పదును కాకుంటే కష్టమే..



ఐదు ఎకరాల్లో 20 రోజుల క్రితం పత్తి పంట సాగు చేశాను. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో వర్షం పడలేదు. పంట వాడిపోతోంది. కొర్ర పంట కూడా వాడిపోతోంది. అప్పుడప్పుడు తేలికపాటి వర్షం పడి ఆగిపోతోంది. పదును వర్షం పడితే రైతులందరూ పంటలు సాగు చేస్తారు. లేదంటే ఈసారి నష్టపోవాల్సిందే.

- సుధాకర్, కొట్టాలపల్లి, యాడికి మండలం

● కొర్ర పంట వాడుతోంది



నాలుగు ఎకరాల్లో కొర్ర పంట సాగు చేశాను. వానలు పడకపోవడంతో పంట వాడిపోతోంది. ఎప్పుడు వర్షం పడుతుందా అని ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాం. కొన్ని రోజులుగా గాలులు ఎక్కువగా వీస్తున్నాయి. వర్షం పడటం లేదు. వర్షాభావం ఇలాగే కొనసాగితే పంట చేతికి అందడం కష్టమే.

- నరసింహ, యాడికి

● అరకొర పదునులో..



ఈ ఏడాది ఇంతవరకు సరైన వానలు పడలేదు. అరకొర పదునులోనే 12 ఎకరాల్లో పత్తి విత్తనం వేశాను. మొలకెత్తింది. కానీ వానలు లేవు. మేఘాలు రోజూ ఊరిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే పంటల సాగు కష్టమే.

- ఆదిరెడ్డి, వీరారెడ్డిపల్లి

● మొండిగా పంటలు వేస్తున్నాం..



మొండి ధైర్యంతో పంటలు వేస్తున్నాం. ఆరు ఎకరాల్లో కంది పంట సాగు చేస్తున్నాను. తేమ అరకొరగానే ఉంది. వర్షం వస్తుందన్న ఆశతో విత్తనం వేస్తున్నాం. సకాలంలో వర్షాలు కురవక ఈసారి కూడా నష్టపోతాం.

- చిన్నయ్య, ఉరవకొండ

● బీడు పెట్టాం..



వర్షాలు రాక పొలాలను బీడుగా వదిలాం. ఈసారి కంది వేయాలనుకున్నాను. ముందస్తుగా వర్షాలు కురిసినా, పంట సాగు చేసే సమయానికి చుక్క వానలేదు. అందుకే పంట పెట్టే ఆలోచన మానుకున్నాను.

- రవీంద్ర, ఉరవకొండ

● 25 తరువాత వర్షాలు



నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈనెల 25వతేదీ తర్వాత జిల్లాలో ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది. ఈ నెలాఖరులోపు విత్తనం వేసేందుకు అవసరమైన వా నలు పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ప్రభావంతో ఇప్పటి దాకా జిల్లాలో వర్షాలు పడ్డాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు ఇంకా ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడిప్పుడే ఉష్ణోగ్రతలు సాధారణమవుతున్న నేపథ్యంలో మరో మూడు రోజుల్లో జిల్లాలో మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

- నారాయణస్వామి, సీనియర్ శాస్త్రవేత్త, వాతావరణ విభాగం, రేకులకుంట

ఆ ముగ్గురూ రిలీవ్

అనంతపురం టౌన్, జూలై 22: జిల్లాకు చెందిన ముగ్గురు ఐఏఎస్ అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సోమవారం రిలీవ్ చేశారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్‌ను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. వారి స్థానంలో ఇన్‌చార్జిలను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టరుగా డీఆర్వో రామక్రిష్ణారెడ్డిని నియమించారు. జడ్పీ ఇన్‌చార్జి సీఈఓగా డీపీఓ ప్రభాకర రావు, నగరపాలిక ఇన్‌చార్జి కమిషనర్‌గా మున్సిపల్ ఆర్‌డీ ఎంవీవీఎస్ మూర్తిని కలెక్టర్ నియమించారు.

ఈనాం వ్యవస్థను రద్దుచేయాలి

చీనీ రైతులు, వామపక్షాల డిమాండ్


రోడ్డుపై బైఠాయించిన రైతులు

అనంతపురం విద్య, జూలై 22: చీనీ కాయలను ఈనాం పద్ధతిలో కాకుండా వేలంపాట ద్వారానే కొనాలని రైతులు, వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గుత్తి రోడ్డులోని మార్కెట్ యార్డ్ వద్ద చీనీ రైతులు సోమవారం రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న సీపీఐ, సీపీఎం నాయకులు అక్కడికి చేరుకుని రైతులకు మద్దతు తెలిపారు. అనంతపురం మార్కెట్ యార్డులో ఈనాం వ్యవస్థను రద్దు చేయాలని, పులివెందుల మార్కెట్ తరహాలో వేలంపాట ద్వారానే చీనీ కాయలను కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా రైతులు అనేక కష్టనష్టాలకు ఓర్చుకుని లక్షల టన్నుల చీనీ పండ్లను పండిస్తున్నారని అన్నారు. కానీ పాలకులు పంటకు గిట్టుబాటు ధర కల్పించలేకపోవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. దళారుల వల్ల కూడా కొంత నష్టపోతున్నారని అన్నారు. మార్కెట్‌లో మొదటి రకం చీనీ దిగుబడులు టన్ను రూ.20 వేలు పలుకుతున్నాయని, కానీ రైతుకు వచ్చేసరికి రూ.10 వేలు, రూ.12 వేలు మాత్రమే అందుతోందని అన్నారు. ఈనాం పదతిని రద్దు చేయంతో పాటు, మార్కెట్‌లో 10 శాతం కమీషన్ కాకుండా 4 శాతం మాత్రమే వసూలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పండ్ల తోటల రైతులను ఆదుకునేందుకు షెడ్లు, కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, రైతులు శ్రీనివాసులు నాయుడు, చెన్నేకొత్తపల్లి శివారెడ్డి పాల్గొన్నారు.

పద్ధతిగా పనిచేస్తే ఫిర్యాదులు రావు

ప్రజా ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖవే ఎక్కువ

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూలై 22: ప్రజా ఫిర్యాదుల వేదికకు ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నాయని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఆ శాఖ అధికారులు పద్ధతిగా పనిచేసి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ప్రజల నుంచి సోమవారం ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టరుతో పాటు డీఆర్వో రామక్రిష్ణారెడ్డి, డీఆర్డీఏ పీడీ ఓబులమ్మ, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధికారులకు మొత్తం 534 ఫిర్యాదులు అందాయి. వీటిపై శాఖల వారీగా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గత వారం వచ్చిన 380 ఫిర్యాదులలో 163 రెవెన్యూశాఖవేనని గుర్తు చేశారు. బెళుగుప్ప, నార్పల, బుక్కరాయసముద్రం, అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, కళ్యాణదుర్గం మండలాల నుంచే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించాలని ఆదేశించారు. పద్ధతిగా పరిశీలిస్తే ఎలాంటి ఇబ్బందులు, ఫిర్యాదులు ఉండవని అన్నారు. పింఛన్ల కోసం ఎంపీడీఓలకు వచ్చే దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల మేరకు మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాల్సిందేనని అన్నారు. అర్జీలకు 24 గంటలు.. లేదా 48 గంటలలో పరిష్కారం చూపాలని, పెండింగ్ పెట్టడానికి వీలు లేదని అన్నారు. వచ్చిన సమస్యలే మళ్లీమళ్లీ రాకుండా ఆయా శాఖల ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

కట్టేసి కొట్టారు..!

జూలాకాల్వలో రెండు రోజుల క్రితం గొడవ


యువకులను కాడిమానుకు కట్టేసి కొడుతున్న గ్రామస్థులు

శింగనమల, జూలై 22: మొహరం వేడుకలలో యువకుల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణ పరస్పర దాడులకు దారితీసింది. ఈ వ్యవహారంలో రెండు వర్గాలకు చెందిన 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఇంతటితో గొడవకు తెరపడుతుందని భావిస్తుండగా, ముగ్గురు యువకులను కాడిమానుకు కట్టేసి కొట్టిన వీడియోలు బయటపడ్డాయి. ఇలా అమానుషంగా దాడిచేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని యువకుల కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. శింగనమల మండలం జూలాకాల్వ గ్రామం వేదికగా ఈ గొడవలు జరుగుతున్నాయి.

మొహరం రోజు మొదలై..

జూలాకాల్వ గ్రామంలో ఈ నెల 18న జరిగిన మొహరం వేడుకలు జరిగాయి. దీంతో శింగనమల మండల కేంద్రానికి చెందిన కొందరు యువకులు గ్రామంలోని తమ బంధువుల ఇళ్లకు వెళ్లారు. పీర్ల ఊరేగింపు సమయంలో వీరు బైకుల మీద తిరుగుతుండగా.. ఆ గ్రామానికి చెందిన యువకులు అడ్డుకున్నారు. ఆ సమయంలో జూలాకాల్వ, శింగనమల యువకుల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. గ్రామానికి చెందిన నాగప్ప అనే వ్యక్తి శింగనమల యువకులను మందలించారు. అదే గ్రామానికి చెందిన వారి బంధువుల యువకుడిపై చేయి చేసుకున్నారు. దీన్ని మనసులో పెట్టుకున్న శింగనమల యువకులు.. అనంతపురం వెళ్లి తిరిగి వస్తున్న నాగప్ప కొడుకుపై శుక్రవారం రాత్రి దాడి చేశారు. విషయం తెలుసుకున్న నాగప్ప కుటుంబ సభ్యులు.. దాడి చేసిన యువకుల బంధువుల ఇంటిమీదకు (జూలాకాల్వలో..) వెళ్లి గొడవపడ్డారు. ఇలా వివాదం ముదిరింది.


గ్రామస్థుల చేతిలో గాయపడ్డ యువకుడు

అర్ధరాత్రి గొడవ..

జూలాకాల్వలోని తమ బంధువుల ఇంటిమీదకు నాగప్ప వెళ్లిన విషయం తెలుసుకున్న శింగనమల యువకులు, అనంతపురం నగరానికి చెందిన తమ స్నేహితులు సుమారు 30 మందితో కలిసి ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో జూలాకాల్వకు వెళ్లారు. నాగప్ప వర్గీయులపై దాడి చేశారు. ఈ గొడవతో మేల్కొన్న గ్రామస్థులు.. తమ ఊరిమీదకే వస్తారా.. అంటూ ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో శింగనమల, అనంతపురం నుంచి వచ్చిన యువకులు చాలామంది పారిపోగా.. నరసింహులు, నంద కిశోర్, దాదు అనే ముగ్గురు వారి చేతికి చిక్కారు. ఈ ముగ్గురిని కాడిమానుకు కట్టేసి గ్రామస్థులు చితకబాదారు. ఈ వీడియోలో సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. జూలాకాల్వ గ్రామం మీద దాడికి వెళ్లిన ఎనిమిది మందిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. దాడి వీడియోలు బయటకు రావడంతో జూలాకాల్వ గ్రామస్థులు ముగ్గురిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామస్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన నరసింహులును మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ గొడవల నేపథ్యంలో జూలాకాల్వ, శింగనమలలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది.

హెచ్చెల్సీకి నీటి విడుదల



స్విచ్ ఆన్ చేస్తున్న బోర్డు సెక్రెటరీ ఓఆర్కే రెడ్డి

రాయదుర్గం, జూలై 22: తుంగభద్ర ఎగువకాలువ(హెచ్చెల్సీ)కు సోమవారం బోర్డు అధికారులు నీటిని విడుదల చేశారు. ఎగువకాలువకు సంబంధించిన షట్టర్ల స్విచ్‌లను ఆన్‌చేసి వంద క్యూసెక్కుల నీటిని బోర్డు కార్యదర్శి ఓఆర్కే రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు గంగపూజ చేశారు. క్రమేపీ నీటి విడుదలను పెంచుతూ రోజుకు 500 క్యూసెక్కులను విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం ఆంధ్ర వాటా నీటిని మాత్రమే అందిస్తున్నారు. మంగళవారం నుంచి కర్ణాటక వాటాను కూడా విడుదల చేయనున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. రాత్రి 9గంటలకు 88.35 టీఎంసీలకుపైగా జలాశయంలో చేరాయి. మంగళవారం రాత్రికి హెచ్చెల్సీ నీరు కణేకల్లుకు చేరనుంది.

పోటెత్తిన వరద


తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఎగువన ఉన్న తుంగ జలాశయం నిండటంతో ప్రస్తుతం 93698 క్యూసెక్కుల నీరు తుంగభద్రలోకి చేరుతోంది. జలాశయం సామర్థ్యం 105.788 టీఎంసీలు ఉండగా ఇప్పటికే 88.35 టీఎంసీల నీరు జలాశయంలోకి చేరాయి. దీంతో అధికారులు అప్రమత్తమై మూడుగేట్లు ఎత్తి ఐదువేల క్యూసెక్కుల నీటిని నదికి సోమవారం వదిలారు. జలాశయానికి 33 క్రస్టుగేట్లు ఉండగా, నీటి చేరిక ఆధారంగా మరిన్ని గేట్లు తెరిచే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు.



నదిలోకి నీరు..

హెచ్చెల్సీకి 26.28 టీఎంసీల నీటి కేటాయింపులు

అనంతపురం క్లాక్‌టవర్: ఈ ఏడాది టీబీ డ్యాంలో నీటి నిల్వ 172టీఎంసీల ఆధారంగా హెచ్చెల్సీకి 26.28టీఎంసీల నీరు కేటాయించినట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. సోమవారం టీబీ డ్యాం నుంచి బోర్డు సెక్రటరీ ఓఆర్కే రెడ్డి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేశారు. టీబీ డ్యాం నుంచి ఈనెల 26వతేదీ వరకు 500 క్యూసెక్కులు నీటిని వదులుతున్నారని, 27నుంచి 750క్యూసెక్కుల వరకు, పెంచుతారని ఎస్ఈ రాజశేఖర్ పేర్కొన్నారు. ఇప్పటికే హెచ్చెల్సీకి తాత్కాలిక మరమ్మతులు పూర్తిచేశామని, కాలువ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీబీ డ్యాం నుంచి విడుదలైన నీరు 23 అర్ధరాత్రి లేదా 24 ఉదయానికి ఆంధ్రా సరిహద్దు హెచ్చెల్సీ 109కిలోమీటరుకు చేరుతాయని తెలిపారు. నీరు ఎక్కడా లీకేజీ కాకుండా, కాలువను పటిష్ట పరుస్తున్నామన్నారు. టీబీ డ్యాం నుంచి వచ్చే నీటిని రిజర్వాయర్లలో పూర్తిగా నింపుకున్న తరువాత ఐఏబీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. తొలుత తాగునీటికే అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.



తుంగభద్ర ఎగువ కాలువకు విడుదలవుతున్న నీరు

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ టౌన్, జూలై 22: బీసీ సంక్షేమం శాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ (ఎస్టీటీ, స్కూల్ అసిస్టెంట్) ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ సత్యసాయిజిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 60రోజుల పాటు శిక్షణ ఇస్తామని వెల్లడించారు. 70శాతం హాజరున్నవారికి మాత్రమే స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. 200మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు మార్కులజాబితా, టీసీ, డిగ్రీ, మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రం, బ్యాంక్ పాసుపుస్తకంతో కూడిన దరఖాస్తులను పెనుకొండ పోలీస్‌స్టేషన్ పక్కనున్న బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, జూలై 22: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.2,500, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1337టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



టమోటా కిలో రూ.47



అనంతపురం రూరల్, జూలై 22: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.34, కనిష్ఠ ధర రూ.15 పలికినట్లు ఆయన తెలిపారు.

ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా రమేష్ బాబు



రమేష్‌బాబుకు ఉత్తర్వులు అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ

అనంతపురం సెంట్రల్, జూలై 22: ఎస్కేయూ నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ ఈరమాసి రమేష్‌బాబు నియమితులయ్యారు. రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య పదవీకాలం ఆదివారంతో ముగిసింది. దీంతో నూతన రిజిస్ట్రార్‌గా రమేష్ బాబును నియమిస్తూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబుకు అభినందనలు వెల్లువెత్తాయి. పలువురు బోధన, బోధనేతర సిబ్బంది ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కళ్యాణదుర్గం మండలం బట్టువానిపల్లికి చెందిన రమేష్ బాబు ఎస్కేయూలో ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. అనంతరం 2000 సంవత్సరంలో రీసర్చ్ కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. రిటైర్‌మెంట్, పెన్షన్ విభాగంలో పనిచేస్తూ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. దీంతో వర్సిటీ ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. రమేష్‌బాబు స్వగ్రామం బట్టువానిపల్లిలో ఆయన స్నేహితులు, కుటుంబ సభ్యులు సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్ యాదవ్‌తోపాటు ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులకు రమేష్‌బాబు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు తిమ్మప్ప, ఉమాపతి, లోకేష్, మద్దిలేటి, శ్రీరాములు, లక్ష్మీరామ్, టైంస్కేల్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యక్షులు శివయ్య, ప్రధానకార్యదర్శి సంజీవప్ప, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నారాయణప్ప, రమేష్, హనుమంతు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, జూలై 22: నిరుద్యోగ యువతకోసం బుధవారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి సోమవారం తెలిపారు. రిలయన్స్ నిప్పో లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా పనిచేసేందుకు అర్హుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన 45 ఏళ్లలోపు వయసు వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటాతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 08554- 245547 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

పెండింగ్ రోడ్లను పూర్తి చేయాలి

పార్లమెంట్‌లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, జూలై 22: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల నిర్మాణాలు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్లమెంట్‌లో కోరారు. సోమవారం జరిగిన వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ మాట్లాడుతూ.. రూ.995.09 కోట్లతో 2016 సంవత్సరంలో ప్రారంభమై 2018 నాటికి పూర్తి కావాల్సిన గుత్తి-గుంతకల్లు జాతీయ రహదారి పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆగిపోయాయన్నారు. రహదారిలో గుంతలు పడటంతో తరచూ ప్రమాదాలు జరిగి అనేక మంది మరణిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్‌ను మార్చి త్వరగా పనులు చేపట్టాలని కోరారు. అలాగే ఎమ్మిగనూరు నుంచి పత్తికొండ, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం మీదుగా పావగడ, మడకశిర వద్ద జాతీయ రహదారిని కలిపేలా నూతన జాతీయ రహదారితోపాటు, బళ్లారి నుంచి బొమ్మనహాళ్, గుండ్లపల్లి, వేపరాళ్ల రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. ఈ రహదారుల వల్ల అనంత జిల్లా మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

డీడీఎన్ఎస్, డెత్ గ్రాట్యుటీలను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి రాజేష్

అనంతపురం కల్చరల్, జూలై 22: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అర్చకులకు నిలిచిపోయిన డీడీఎన్ఎస్, డెత్ గ్రాట్యుటీలను పునరుద్ధరించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డిపల్లి రాజేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ కల్యాణమండపంలో సోమవారం అర్చక సమావేశం నిర్వహించారు. సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాజేష్ మాట్లాడారు. రకరకాల కారణాల వల్ల ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలా దేవాలయాలు డీడీఎన్ఎస్ పథకానికి దూరంగా ఉన్నాయన్నారు. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 475 దేవాలయాలను డీడీఎన్ఎస్ కింద ఎంపిక చేసినప్పటికీ పథకం అమలు చేయకుండా వైసీపీ ప్రభుత్వం కాలక్షేపం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం అయినా డీడీఎన్ఎస్, డెత్ గ్రాట్యుటీలను అమలు చేసి అర్చకులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య కోశాధికారి శ్రీనివాసులు, కొమండూరు మారుతిప్రసాద్, ముచ్చుకోట ప్రసాద్, భక్తరహళ్లి వేణుగోపాల్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఈఓ

అనంతపురం విద్య, జూలై 22: జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓగా ప్రభాకర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పంచాయతీ ఆఫీసర్(డీపీఓ)గా పనిచేస్తున్న ప్రభాకర్‌రావును ఇన్‌చార్జ్ సీఈఓగా జిల్లా కలెక్టర్ నియమించారు. దీంతో సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఆయన జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత జడ్పీ సీఈఓ ఛాంబర్‌లో ఇన్‌చార్జ్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు జడ్పీఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బిల్లు కట్టేది ఎలా..?

- విద్యుత్ బిల్లు చెల్లింపునకు వినియోగదారుల పాట్లు
- పనిచేయని ఏపీఎస్పీడీసీఎల్ కస్టమర్ యాప్
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- విద్యుత్ కౌంటర్లకు క్యూకడుతున్న ప్రజలు
- తగ్గిన విద్యుత్ బిల్లు చెల్లింపులు

అనంతపురం రూరల్, జూలై 22: విద్యుత్ బిల్లుల చెల్లించేందుకు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు చెల్లింపునకు ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్ వల్ల ఉపయోగం లేకుండా పోయింది. డిస్కం వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులకు సర్వర్ కష్టాలు తలెత్తుతున్నాయి. వినియోగదారులకు కనీస అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. దీనికితోడు ప్రస్తుతం జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలకు మరింత వినియోగదారులకు భయపడిపోతున్నారు. ఈక్రమంలోనే విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రాలకు క్యూకడుతున్నారు. కాగా ఈ ప్రభావం విద్యుత్ బిల్లులు వసూళ్లపై పడుతోంది. ఇందుకు ఈనెలలో ఇప్పటి వరకు వసూలైన కలెక్షన్సే నిదర్శనం. గత నెల 22(జూన్)కి రూ.64.54కోట్లు వసూలైంది. ఈ నెలలో రూ. 44.93కోట్లు మాత్రమే వసూలైంది. ఇప్పటి వరకు దాదాపు రూ.20కోట్ల మేర ఈనెల విద్యుత్ బిల్లుల చెల్లింపులు తగ్గిపోయాయి.

పనిచేయని క్యూఆర్ కోడ్

ఈనెల మొదటి నుంచి ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌ల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపులను ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ నిలిపేసింది. కేవలం సంస్థ కస్టమర్ యాప్, డిస్కం వెబ్‌సైట్ నుంచి బిల్లులు చెల్లించాలని సంస్థ సూచించింది. ఈక్రమంలోనే విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రాల వద్ద కస్టమర్ యాప్ క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. అయితే వాటివలన వినియోగదారులకు ఏమాత్రం ప్రయోజనం కలగడం లేదు. వినియోగదారులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా బిల్లు చెల్లింపు ప్రక్రియ ఓపెన్ కావడం లేదు. అలాగే వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులకు ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయింది. వెబ్‌సైట్ ద్వారా అన్ని వివరాలు నమోదు చేసి, సబ్మిట్ కొట్టిన తరువాత యూపీఐ అడుగుతోంది. అక్కడ ఫోన్‌పే, గూగుల్ పే వంటి వాటి ద్వారా చెల్లించేందుకు వినియోగదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రక్రియ మొత్తం పూర్తి అయి అమౌంట్ కూడా చెల్లిస్తున్నారు.



ఏపీఎస్పీడీసీఎల్ కస్టమర్ యాప్ క్యూఆర్‌కోడ్



పవర్ ఆఫీస్ ఆవరణలో విద్యుత్ బిల్లు చెల్లింపునకు క్యూ

ఆతరువాత నాలుగు నిమిషాల టైం లిమిట్ పడుతోంది. ఆతరువాతైనా బిల్లు చెల్లింపు పూర్తి అవుతుందా అంటే లేదు. సర్వర్ సమస్యతో పేమెంట్ అన్ సక్సెస్ అని చూపుతోంది. పలుమార్లు ఇదేవిధంగా వినియోగదారులు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతరవాటి ద్వారా బిల్లులు చెల్లింపులకు అలవాటుపడిన వినియోగదారులు కొత్త విధానంతో ఇబ్బందులు పడుతున్నారు.

అవగాహన కల్పిస్తాం



విద్యుత్ బిల్లులు డిస్కం యాప్‌ల ద్వారా చెల్లించాలి. ఈక్రమంలోనే బిల్లులు చెల్లింపు కొత్త విధానంపై క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, సిబ్బందితో వినియోగదారులకు అవగాహన కల్పించి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. ఇదే క్రమంలో వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రాలు పెంపునకు చర్యలు చేపడతాం. ఆమేరకు శాఖలోని ఉద్యోగులు, సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

- రాజశేఖర్, ఈఈటీ, విద్యుత్ శాఖ

భూ తగాదాతోనే హత్య

- బావను హత్య చేసిన బావమరిది
- ఆటోడ్రైవర్ హత్యకేసు నిందితుల అరెస్టు

ధర్మవరంరూరల్, జూలై22: ఆటోడ్రైవర్ తాడిమర్రి సూర్యనారాయణ హత్యకేసును ధర్మవరం రూరల్ పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జ్ డీఎస్పీ బాజీజాన్‌సైదా హత్యకేసుకు సంబంధించి వివరాలను విలేకరులకు సోమవారం వెల్లడించారు. తాడిమర్రికి చెందిన సూర్యనారాయణ చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి గ్రామంలో 23 ఏళ్లకిందట క్రిష్ణవేణిని పెళ్లి చేసుకున్నాడు. భార్యతో కలిసి అక్కడే ఉండేవాడు. క్రిష్ణవేణి తండ్రి చనిపోగా తల్లి సాలమ్మ పేరు మీద మొత్తం భూమి ఉంది. వారం రోజుల కిందట భూమి విషయంపై క్రిష్ణవేణి అన్న ఏలూరు మల్లికార్జునతో సూర్యనారాయణ గొడవ పడ్డాడు. ఈ భూమిని దక్కించుకోవడం కోసం మల్లికార్జున తన బావ అయినా సూర్యనారాయణను అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. ఈక్రమంలో ఈనెల 19న రాత్రి ఆటో తోలుకుంటూ వెల్దుర్తికి వెళుతున్న సూర్యనారాయణను సీసీకొత్తకోట సమీపంలో ఉడుతరాళ్ల పొలం వద్ద ఆపారు. భూమి విషయం మాట్లాడుదామని పక్కకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లగానే మల్లికార్జున, ఆయన కుమారుడు చాకలిరాము, అల్లుడు రాజు, సమీప బంధువైన లక్ష్మీనారాయణతో కలిసి సూర్యనారాయణ తలపై రాడ్డుతో కొట్టారు. చేతులు కాళ్లు కట్టేసి చంపి అక్కడి నుంచి పరారయ్యారు. మృతుడి భార్య క్రిష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు ఛేదింపు కోసం ఇన్‌చార్జ్ డీఎస్పీ బాజీజాన్‌సైదా ఆధ్వర్యంలో రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్ఐ నరేంద్రతో కలిసి ప్రత్యేక టీంను ఏర్పాటుచేసి దర్యాప్తును వేగవంతం చేశారు. లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు బావమరిదే బావను హత్య చేసినట్లు విచారణలో తెలుసుకున్నారు. దీంతో సోమవారం నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు పంపామన్నారు. హత్యకు వాడిన రాడ్డు, సెల్‌ఫోన్, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ ఆరోహణరావు, ఎస్ఐ నరేంద్ర, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

చౌక ధరల ధాన్యం డిపోల్లో బియ్యం స్వాహా

గుమ్మఘట్ట, జూలై 22: మండలంలోని వివిధ గ్రామాల్లో చౌకధాన్యపు డిపోల్లో డీలర్లు బియ్యం, జొన్నలు స్వాహా చేశారని సీఎస్‌డీటీ సుదర్శనాచారి పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా డీలర్లు డిపోలు నడుపుతూ ప్రజలకు అందించే సబ్సిడీ బియ్యాన్ని సక్రమంగా అందించకుండా నిల్వలు చూపుతూ వస్తున్నారన్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో చౌక ధరల ధాన్యపు డిపో డీలర్లను మారుస్తారన్న అనుమానంతో డిపోలో చౌకబియ్యం నిల్వలు లేకుండా స్వాహా చేసినట్లు తెలుస్తోందన్నారు. ఇప్పటికే అలాంటి డిపోలను పది దాకా తనిఖీ చేసి కేసులు నమోదు చేశామన్నారు. మరిన్ని డిపోలు తనిఖీ చేసి అక్రమాలు తేలితే డీలర్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీలర్లు నిల్వ ఉన్న బియ్యాన్ని ప్రభుత్వ అధికారులకు స్వాధీన పరచాలని లేని పక్షంలో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటిదాకా 75 వీరాపురం షాప్ నంబర్ 15లో 28.34 క్వింటాళ్లు, తాళ్లకెర నాలుగోషాప్‌లో 36 క్వింటాళ్లు, ఐదోషాప్‌లో 30 క్వింటాళ్లు, గుమ్మఘట్ట ఒకటిలో 30 క్వింటాళ్లు, రెండులో 17.50 క్వింటాళ్లు, బేలోడులో 17 క్వింటాళ్లు, కలుగోడు మూడులో 24 క్వింటాళ్లు, రంగచేడు 24వ షాప్‌లో 18.59 క్వింటాళ్లు, గొల్లపల్లి షాప్ 15లో 19.5 క్వింటాళ్లు చౌకబియ్యం స్వాహా చేసినట్లు అధికారుల రికార్డుల ద్వారా తెలిసింది.

మార్షల్ ఆర్ట్స్‌లో ఎన్ఎస్‌పీఆర్ విద్యార్థినికి బంగారు పతకం



అర్పితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

హిందూపురం అర్బన్, జూలై 22: మార్షల్ ఆర్ట్స్‌లో ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినికి బంగారు పతకం దక్కినట్లు ప్రిన్సిపాల్ ప్రగతి తెలి పారు. ఆదివారం హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో కళాశాల విద్యార్థిని అర్పిత బంగారు పతకం సాధించిందన్నారు. ఆ విద్యార్థినిని ప్రిన్సిపాల్ అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలకు కరాటే విద్య ఎంతో అవసరమ న్నారు. ఆత్మరక్షణకు ప్రతి మహిళ కరాటే నేర్చుకోవాల న్నారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ రామచంద్రకు ధన్యవాదాలు తెలిపారు. అర్పితకు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, సభ్యులు తుల్జాబాయి, భువన, అశ్వత్థలక్ష్మి, పద్మ తదితరులు ఆర్థికసాయం అందించారు.

సార్..! అద్దె ఇప్పించండి..

- ఎన్నికలు ముగిసి రెండునెలలైనా పట్టించుకోరా?
- బిల్లులు ఎవరిని అడగాలో తెలియక తికమక
- డీటీసీ ఎదుట వాహన యజమానుల ఆవేదన



డీటీసీ ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న వాహన డ్రైవర్లు

అనంతపురం టౌన్, జూలై 22: ఎన్నికల సందర్భంగా తిప్పిన వాహనాలకు అద్దె చెల్లించాలని వాటి యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి రెండు దాటిపోయినా ఇంత వరకు తమకు వాహనాల అద్దె చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల నిర్వహణకు నియమితులైన అధికారులు, పోలీస్ యంత్రాంగం అనేక అద్దె వాహనాలను వినియోగించుకున్నారు. డీటీసీ ద్వారా ఆ వాహనాలను సమకూర్చుకున్నారు. రవాణాశాఖాధికారులు చెప్పిన మేరకు కేటాయించిన నియోజకవర్గాలకు వెళ్లి వాహనదారులు ఎన్నికల విధుల్లో సాయపడ్డారు. 24గంటలపాటు అక్కడే ఉండి అధికారుల వెంట వాహనాలను తిప్పారు. ఒక్కో వాహనానికి రోజుకు రూ.1500 బాడుగ, రూ.1200 డ్రైవర్‌కు బత్తా రూపంలో చెల్లిస్తారని రవాణా అధికారులు చెప్పారు. జిల్లాలోని అనంతపురం, శింగనమల, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు ఈవాహనాలను వాడుకున్నారు. ఎన్నికలు ముగిసి రెండునెలలు కావస్తున్నా ఆవాహనాలకు అద్దె బిల్లులు చెల్లించలేదు. ఎన్నికల అధికారులను అడిగితే కలెక్టరు, జేసీ, డీఆర్ఓలను అడగండంటున్నారు. పోలీసులకు వినియోగించిన వాహనాల యజమానులు వెళ్లి అడిగితే ఎస్పీని అడగాలంటున్నారు. ఆ వాహన యజమానులు, డ్రైవర్లు వారివద్దకు వెళ్లి అడగలేక సతమత అవుతున్నారు. వాహనాలను పంపించిన రవాణాశాఖ అధికారులను అడిగితే ఇపుడు మాకు సంబంధం లేదు రెవెన్యూ, ఎస్పీలనే అడగాలంటున్నారు. ఈనేపథ్యంలో సోమవారం కొందరు వాహనడ్రైవర్లు కలెక్టరేట్‌లోని మీకోసంకు వచ్చారు. అక్కడ కలెక్టరు లేకపోవడంతో డీటీసీని కలిసి తమ వాహనాల అద్దె గోడును వెల్లబోసుకున్నారు. అపుడు కూడా డీటీసీ ఈ అద్దెలు రెవెన్యూ, ఎస్పీల వద్దకే వెళ్లి అడగాలని సూచించారు. దీంతో అద్దె ఎవరిస్తారో తెలియక వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎన్నికల విధులకు ఖర్చుపెట్టిన అనేక విషయాలలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో ఈవాహనాల బిల్లులు ఏమి చేశారోనన్న విమర్శలు వస్తున్నాయి.

బీబీ ఫాతిమా తొలి దర్శనం



భక్తులకు దర్శనమిస్తున్న బీబీ ఫాతిమా పీరు

అనంతపురం కల్చరల్, జూలై 22: జిల్లాలో గూగూడు తర్వాత అంత పెద్దఎత్తున నిర్వహించే బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని ఐదవ రోడ్డులో బీబీ ఫాతిమా దర్గా వద్ద సోమవారం సాయంత్రం అమ్మవారి తొలిదర్శనాన్ని నిర్వహించారు. తొలుత దర్గాలో అమ్మవారి ఆభరణాలతో కూడిన పెట్టెను బయటకు తీసి బీబీ ఫాతిమా పీరు తొలిదర్శనం చేశారు. అనంతరం పెట్టెను పురవీధుల్లో మేళతాలాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. దర్గా ముందు అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవ నిర్వాహకులు మల్లికార్జున, నరసింహులు, కేఎస్ మురళి, కిశోర్, మహేష్, చంద్రశేఖర్, అజ్జి, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ జెండా దినోత్సవం

అనంతపురం విద్య, జూలై 22: జాతీయ జెండా దినోత్సవాన్ని బ్రైట్‌కిడ్స్ స్కూల్‌లో ఇన్నర్ వీల్ క్లబ్, ఆ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జూలై 22 జాతీయ జెండా దినోత్సవం ఆవశ్యకతను, ప్రాముఖ్యత, జెండా రూపకల్పనలో జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య గొప్పతనాన్ని వక్తలు పిల్లలకు వివరించారు. గో సంరక్షణ కమిటీ నుంచి దేవరకొండ కౌలస్య హాజరై విద్యార్థులకు దేశభక్తి గురించి, తల్లిదండ్రులపై చూపాల్సిన గౌరవాన్ని వివరించారు. దేశ నిర్మాణం తరగతి గది నుంచి మొదలవుతుందని, బాల బాలికలు ఉత్తమ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. తర్వాత స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న దేశాయి కరణం శ్రీయాన్ గౌతం జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు జయంతి, ప్రతిమ, శ్యామల, శ్రీవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ జెండా దినోత్సవంలో ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు, విద్యార్థులు

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

నార్పల, జూలై 22: మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తహసీల్దారుకు సోమవారం ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో 5 వేల వాల్మీకి కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలో ఇంత వరకు వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయలేదన్నారు. విగ్రహం ఏర్పాటుకు కూతలేరు బ్రిడ్జి సర్కిల్ రోడ్డు పక్కన, పాతరామ స్వామి గుడికి వెళ్లేదారి పక్కన ఏదైనా ఒక ప్రదేశంలో అనుమతి ఇవ్వాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో చిలంకూరు జయరాం, కొట్టం నరసింహులు, బారికి సుబ్బు, చిన్న, పాముల శ్రీరాములు, బాలనాగి నరేష్, తలారి ప్రతాప్, డీలర్ నరసింహులు పాల్గొన్నారు.

షార్ట్ ఫిలిం పోటీల్లో అనంతకు ద్వితీయ స్థానం



బహుమతి అందుకుంటున్న తరిమెల రాజు, జంగం శ్రీనివాసులు

అనంతపురం కల్చరల్, జూలై 22: విప్లవ కవి, సినీ గేయ రచయిత దాశరథి శత జయంతిని పురస్కరించుకుని దాశరథి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన షార్ట్ ఫిలిం పోటీల్లో అనంతపురం జిల్లాకు ద్వితీయ బహుమతి దక్కింది. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన షార్ట్ ఫిలిం పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ షార్ట్‌ఫిలింలను ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి సోమవారం సాయంత్రం బహుమతుల ప్రదానం చేశారు. పోటీల్లో ద్వితీయ స్థానంలో అనంతపురం నగరానికి చెందిన తరిమెల రాజు దర్శకత్వంలో జంగం శ్రీనివాసులు నిర్మించిన ఆర్‌టీఐ(ది పవర్ ఆఫ్ కామన్ మ్యాన్) షార్ట్ ఫిలిం నిలిచింది. సీనియర్ కవి నందినీ సిద్దారెడ్డి, తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షురాలు శ్రీదేవి చేతులమీదుగా తరిమెల రాజు, జంగం శ్రీనివాసులకు జ్ఞాపిక, రూ.15వేలు నగదు బహుమతి అందించి సత్కరించారు.

అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయండి

అనంతపురం క్రైం, జూలై 22: నగరంలోని అశోక్‌నగర్‌లో నిర్మిస్తున్న అక్రమ భవన నిర్మాణాన్ని వెంటనే ఆపివేయాలని ఆ కాలనీ వాసులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అశోక్‌నగర్ అమ్మవారి చెరువు వంక స్థలంలో డోర్ నెంబర్ 12-623 ఇంటి నిర్మాణ పనులు రస్తాను, వంకను ఆక్రమించి కట్టడాలు చేపట్టడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. స్థలాన్ని సర్వే చేయించాలని కాలనీవాసులు ఈశ్వరయ్య, పెద్దన్న, లక్ష్మీదేవి, రాజా, తిరుపాలు కోరారు.

ఉనికి కోసమే జగన్ హత్యారాజకీయాలు

శింగనమల జూలై 22: రాష్ట్రంలో జగన్ తన ఉనికి కోసమే హత్యా రాజకీయలకు తెరలేపుతున్నారని మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్ అన్నారు. శింగనమలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వినుకొండలో వ్యక్తిగత కక్షతో వైసీపీ వర్గాల మధ్య జరిగిన హత్యను జగన్ రెడ్డి టీడీపీపై రుద్ది తన ఉనికికోసం శవ రాజకీయలు చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులపై దాడులు చేసినా ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ప్రజలలో సింపతీ కోసమే డ్రామాలు మొదలుపెటాడని ఆరోపించారు

విద్యాసామగ్రి పంపిణీ

రామగిరి, జూలై 22: మండలంలోని గంతిమర్రి ప్రాథమికోన్నతపాఠశాలలో 1 నుంచి 5వతరగతి విద్యార్థులకు ఆత్మీయట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఎంఈఓ శ్రీనివాసులు, ట్రస్టు చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి విద్యాసామగ్రిని అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ఆత్మీయ ట్రస్టు ద్వారా విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు బాలరాజు, బ్రహ్మ, మనోహర్, అక్కులప్ప, నాగరాజు, ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, శివయ్య, విజయ్‌కుమార్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం క్రైం, జూలై 22: నగరంలో మంగళవారం సాయంత్రం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలిక ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జల్లిపల్లి సమీపంలో తాగునీటి పైపులైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం సాయంత్రం అంతరాయం కలుగనుందన్నారు. ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

● కమిషనర్ ఢిల్లీరావుకు ఎంపీఈఓల వినతి

అనంతపురం అర్బన్, జూలై 22: వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావును ఆ సంఘం నాయకులు కోరారు. సోమవారం విజయవాడలోని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో ఢిల్లీరావును ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, నాయకులు శంకర్, భాస్కర్ నాయక్ వినతి పత్రం అందజేశారు. 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించేలా చూడాలన్నారు. చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న జిల్లాకు చెందిన ఎంపీఈఓలకు తిరిగి అనంతలోనే పోస్టింగ్‌లు ఇప్పించాలని కోరారు. ఓడీపై వెళ్లకపోవడంతో టర్మినేట్ చేసిన వారికి తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్బీకే సిబ్బంది తరహాలోనే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సకాలంలో రెన్యువల్ చేయడంతో పాటు ప్రతినెలా వేతనాన్ని చెల్లించేలా చూడాలని కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీఈఓల సంఘం నాయకులు

ప్రభుత్వ మార్క్ హర్షణీయం



జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఆర్ఈఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 22: అనుభవాన్ని, పారదర్శకతకు కొలమానంగా ఉద్యోగులకు ఉన్నత పదవులు అప్పగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మార్క్ హర్షణీయమని ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర అన్నారు. జేఎన్‌టీయూ వీసీగా సుదర్శనరావు, రిజిస్ట్రార్‌గా క్రిష్ణయ్య ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. సోమవారం ఆర్ఈఎఫ్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం రామచంద్ర మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులను అనేక ఇబ్బందులకు గురిచేస్తూ మానసికంగా, ఆర్థికంగా వేధించారని గుర్తుచేశారు. నూతన పరిపాలనతో ఉద్యోగులందరికీ న్యాయం జరుగుతుందన్న నమ్మకముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, నాగభూషణం, మల్లేసు, శంకర్, పరశురాం, ఓబులేసు, గోవర్ధన్, పుష్పలత పాల్గొన్నారు.

ఎస్కేయూ రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు



రిజిస్ట్రార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

అనంతపురంరూరల్, జూలై 22: మండలంలోని ఆకుతోటపల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రమేష్‌ను కలిశారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన క్రమంలో సోమవారం క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగేమురళీమోహన్ ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు నాగేంద్ర, బుల్లె ఆది, మండల చంద్రశేఖర్, ఈడిగ ప్రవీణ్‌గౌడ్, నవీన్, వెంకటరాముడు, చాకలి కృష్ణా, రాము పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీని కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

అనంతపురం సెంట్రల్, జూలై 22: జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావును సోమవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగ్గయ్య చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీకి శుభాకాంక్షలు తెలిపిన ఆయన వర్సిటీ పరిధిలోని విద్యార్థులకు మెరుగైన బోధన అందేలా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో రాకేష్, విశ్వనాథ్, సంతోష్ పాల్గొన్నారు.



వీసీని సన్మానిస్తున్న బుగ్గయ్య చౌదరి

పేదలకు కనీస వసతులు కల్పించాలి

అనంతపురం రూరల్, జూలై 22: మండలంలోని ఉప్పరపల్లి గ్రామ సర్వే నెంబరు 194-8లో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు కనీస వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం స్థానికులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. స్థానికంగా 600 మంది గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు లేక పట్టణంలో ఇళ్లపనులు, బేల్దారి, ఇతరత్రా పనులు చేసుకుంటూ ఇక్కడ నివాసముంటున్నారన్నారు. పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నగర కార్యదర్శి ఆర్‌వీ నాయుడు, కార్యవర్గ సభ్యులు ఇర్ఫాన్, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంభూపాల్

మొరాయించిన ఆర్టీసీ బస్సు

అనంతపురం కల్చరల్, జూలై 22: బెంగళూరు నుంచి అనంతపురం వస్తున్న ఆర్టీసీ బస్సు నడిరోడ్డుపై ఆగిపోయి మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాడిపత్రి డిపోకు చెందిన ఏపీ02 జెడ్0524 నెంబర్ బస్సు సోమవారం సాయంత్రం 3.30 గంటలకు 50 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి అనంతపురం బయలుదేరింది. బస్సు పెనుకొండ శివారుకు చేరుకోగానే ఇంజన్ సమస్యతో ఆగిపోయింది. బస్సు సెల్ఫ్ స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులు కిందకు దిగి తోయాల్సి వచ్చింది. అనంతరం బస్సు స్టార్ట్ అయ్యి అనంతపురం చేరకునేలోపు మరో రెండు సార్లు ఆగిపోయవడంతో ప్రయాణికులే మళ్లీ తోయాల్సి వచ్చింది. బస్సు తరచూ మొరాయిస్తుండటంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు.



బస్సును తోస్తున్న ప్రయాణికులు

మానసిక దృఢత్వాన్ని పెంచుకోవాలి

అనంతపురం సెంట్రల్, జూలై 22: లక్ష్యసాధనకోసం మానసిక దృఢత్వాన్ని, ఏకాగ్రతను పెంచుకోవడం ద్వారా లక్ష్యాన్ని ఛేదించవచ్చని శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో 'విద్య-ఉద్యోగం' అంశంపై ప్రిన్సిపాల్ అధ్యక్షతన హైదరాబాద్ ఎడ్వేద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తలుగా ఎడ్వేద సంస్థ ప్రతినిధులు బాలక్రిష్ణ, రవికుమార్, అవినాష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కంప్యూటర్ కోర్సులు అభ్యసించడం, నైపుణ్యాలను మెరుగుపరుకోవడం, కొత్త ఆవిష్కరణలు ఆకళింపు చేసుకోవడం తదితర అంశాలను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు షేక్షావలి, హబీబ్, మాధవి పాల్గొన్నారు.

విధుల్లోకి చేరిన ఉద్యానశాఖ ఇన్‌చార్జి అధికారి

అనంతపురం అర్బన్, జూలై 22: ఉద్యాన శాఖ ఇన్‌చార్జి అధికారి నరసింహారావు సోమవారం తిరిగి విధుల్లో చేరారు. 20 రోజుల క్రితం ఆయన వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్‌కు ఉద్యాన శాఖ ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. సెలవులు ముగియంతో నరసింహారావుకు తిరిగి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

వారపు సంత వేలం

చెన్నేకొత్తపల్లి, జూలై 22: చెన్నేకొత్తపల్లి వారపుసంత వేలంపాటను సోమవారం అధికారులు నిర్వహించారు. స్థానిక గ్రామసచివాలయం-1లో సర్పంచ్ ధనశ్రీ, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్, పంచాయతీకార్యదర్శి శ్యామల ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించారు. ఈ వేలంలో 2లక్షల 36వేల 980 రుపాయిలు నీకేపల్లికి చెందిన అశ్వర్థరెడ్డి వేలంపాటలో దక్కించుకున్నారు. ఆగస్టు నుంచి మార్చినెల వరకు నెలల కాలం వ్యవధి వరకు ఈ వేలం నిర్వహించడం జరిగిందని ఈఓఆర్‌డీ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పాత పద్ధతి కొనసాగించండి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 22: ప్రభుత్వ ఆస్పత్రి ఓపీ విషయంలో పాతపద్ధతిని కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి నిత్యం వందలాది మంది వివిధ ప్రాంతాలనుంచి వస్తుంటారని ఓపీ చీటీ కోసం వారి ఓపికను గంటల తరబడి పరీక్షించడం ఎంతవరకు న్యాయమని వారు అధికారులను ప్రశ్నించారు. సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావును కలిసి ఓపీ చీటీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ 15 విభాగాలకుపైగా వైద్యసేవలందిస్తున్న ఆ సుపత్రిలో ఓపీచీటీ తీసుకోవాలంటే రిజిస్ట్రేషన్, ఆధార్ అంటూ ముప్పుతిప్పలు పెడుతున్నారని, ఈ నిబంధనలు ఎత్తివేసి పాతపద్ధతిలో నేరుగా ఓపీ చీటీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. నాయకులు కేబీ మధు, రేకలకుంట రామాంజనేయులు, నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు.

అనాథాశ్రమ స్థలాన్ని కాపాడండి

రాప్తాడు, జూలై 22: పంచాయతీ పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీలో అనాథాశ్రమం (అల్ ఫైగా- మే గరీబ్ నవాజ్ మదర్‌సా) కబ్జా కాకుండా కాపాడాలని కాలనీ వాసులు మున్నా, అబ్దుల్ రహీమ్, మహబుబ్ బాషా, ఇబ్రహీం, ఇర్షాద్, మహమ్మద్‌బాషా, షేక్షావలి కోరారు. వారు మాట్లాడుతూ 2005లో 119 సర్వే నంబర్‌లో అప్పటి ప్రభుత్వం ముస్లిం మైనార్టీ 117 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. కాలనీలో స్థానికుల సంక్షేమం కోసం మసీదు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, అనాథాశ్రమం నిర్మించుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించిందన్నారు. అనాథాశ్రమం కోసం 21 సెంట్లు కేటాయించింది. దీని నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో స్థలం ఖాళీగా ఉందన్నారు. ఆ స్థలాన్ని మైనార్టీ కాలనీలో నివాసం ఉంటున్న ఖాజీ పీరా, అమానుల్లా అనే వ్యక్తులు నకిలీ ఇంటి పట్టాలు సృష్టించి ఇతరులకు విక్రయిస్తున్నారన్నారు. ఆ స్థలంలో సరిహద్దు రాళ్లు పాతేందుకు సిద్ధమవుతున్నారన్నారు. స్థలాన్ని కాపాడాలని రాప్తాడు తహసీల్దార్‌కు, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో అందచేశామన్నారు. రెవెన్యూ అధికారులు అనాథాశ్రమ స్థలం కబ్జా కాకుండా కాపాడాలని కోరారు.



స్థలం చూపుతున్న కాలనీ వాసులు

నా భూమి స్వాధీనం చేసుకుంటున్నారు

● ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన దళిత వృద్ధురాలు

ధర్మవరంరూరల్ (కనగానపల్లి) జూలై 22: తన భూమిని వెంకటరాముడు అనే వ్యక్తి ఆన్‌లైన్ చేయించుకుని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని కనగానపల్లి మండలం కుర్లపల్లి గ్రామానికి చెందిన దళిత వృద్ధురాలు పెద్దక్క ఆర్డీఓ ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం ధర్మవరంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆమె ఫిర్యాదు చేశారు. కుర్లపల్లి గ్రామానికి చెందిన తనకు దాదులూరు గ్రామ పొలం సర్వేనెంబర్ 78-1లో ఐదు ఎకరాల ఉందన్నారు. 50ఏళ్లుగా పంటలు సాగు చేస్తున్నామన్నారు. నా భర్త బతికున్నప్పుడు ఆ భూమిలో వేరుశనగ, కంది, జొన్న, ఉలవలు సాగు చేసుకుని జీవనం సాగించేవారమన్నారు. నాకు ముగ్గురు కుమారులు ఉన్నారని, బతుకుదెరువు కోసం బెంగళూరుకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఇదే అదునుగా భావించిన చంద్రాచెర్ల గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తుల సహాయంతో వెంకటనాయుడు పేరు మీద ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారన్నారు. ఆన్‌లైన్‌లో వన్‌బీ కోసం వెళ్లితే వెంకటనాయుడు పేరు మీద వస్తుండటం చూసి తహసీల్దార్ ఆఫీసుకు వెళ్లితే వాళ్లు తమను బెదిరిస్తున్నారని వాపోయారు. అత్యంత పేదలమని, దయ ఉంచి గ్రామంలో విచారణ చేసి భూమిని తమకు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని బాధితురాలు ఆర్డీఓకు విన్నవించింది.



ఆర్డీఓకు సమస్యను వివరిస్తున్న వృద్ధురాలు పెద్దక్క

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



మహిళకు బిందెను అందిస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జూలై 22: మండలంలోని బి.యాలేరు గ్రామంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను సోమవారం క్లస్టర్ ఇన్‌చార్జి క్రిష్ణమోహన్ చౌదరి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్ ప్రారంభించారు. వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి దురుద్దేశంతో మూత వేయించి గ్రామ ప్రజలకు శుద్ధినీటిని అందకుండా చేశాడన్నారు. పరిటాల సునీత ఎమ్మెల్యే అయిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు వాటర్ ప్లాంటుకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తెచ్చారన్నారు. టీడీపీ మండలనాయకులు నాగేంద్ర, రఘునాథరెడ్డి, నారాయణస్వామి, మధు, ఏడీ ఈశ్వరయ్య, అనిల్, విశ్వనాథ్, పెద్ద ఈశ్వరయ్య, నరసింహులు పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్య పరికరాలు సబ్సిడీతో అందించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్

శింగనమల జూలై 22: బిందు, తుంపర సేద్య పరికరాలు రైతులకు 90 శాతం సబ్సిడీతో అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో రైతాంగ సమస్యలపై ఆయన తహసీల్దార్ శోభన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులు సాగు చేసిన పంటలకు దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోయారన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి సహాయం అందించలేదన్నారు. రైతులకు ప్రభుత్వం వెంటనే 90శాతం సబ్సిడీలతో ఎరువులు, మందులు, బిందు, తుంపర సేద్య పరికరాలు ఇవ్వాలని కోరారు. రైతు సంఘం అధ్యక్షుడు మధుయాదవ్, నారప్ప, నేసే మధు, రామసూబ్బారెడ్డి, కోనప్ప, నాగబయన్న, ఆచారి, నల్లప్ప, రాజు పాల్గొన్నారు.

కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 22: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ కోఆర్డినేటర్ హరి ప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. 35 రోజుల పాటు బెంగళూరులో ఇచ్చే శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కి ల్స్ స్పోకెన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.15వేల కనీస వేతనంతో ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభించే శిక్షణ, పేర్ల నమోదు మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

గొర్రెల షెడ్‌కు బిల్లు చెల్లించండి

శింగనమల జూలై 22: టీడీపీ హయాంలో నిర్మించిన గొర్రెల షెడ్‌కు బిల్లు మంజూరు చేయాలని మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి బోయ రాయుడు కోరారు. సోమవారం తహసీల్దార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో పశువర్ధకశాఖ ఉపాధి హామీ పథకం కింద 80 శాతం సబ్సిడీతో గొర్రెల షెడ్ నిర్మించానన్నారు. వైసీపీ ప్రభుత్వం రావడంతో షెడ్ నిర్మాణానికి వెచ్చించిన డబ్బుకు సంబంధించిన బిల్లులు నేటికీ రాలేదన్నారు. షెడ్ నిర్మాణానికి రూ.1,60,000 రావలసి ఉండగా, ఇప్పటికే రూ.94వేలు బిల్లు తీసుకున్నట్లు నాషెడ్ వివరాలు మొత్తం ఆన్‌లైన్‌లో రెడ్‌మార్క్‌తో చూపుతోందని వాపోయాడు. ఇప్పటికైనా షెడ్ బిల్లు చెల్లించాలని తహసీల్దార్‌కు విన్నవించారు.

తేలుకాటుతో రైతు మృతి

కణేకల్లు, జూలై 22: మండల కేంద్రానికి చెందిన సర్మాస్(48) అనే రైతు తేలు కాటుతో సోమవారం మృతి చెందాడు. గ్రామ సమీపంలోని తనకు గల మాగాణి భూముల్లో ఆదివారం వ్యవసాయం చేస్తుండగా తేలు కొరికింది. కానీ సర్మాస్ దాని గురించి పెద్దగా పట్టించుకోలేదు. సోమవారం పొలంలో పనులు చేస్తుండగా ఉన్న ఫలానా స్పృహ కోల్పోయి కింద పడి చనిపోయినట్లు చుట్టు ప్రక్కల వారు తెలిపారు. తేలు కాటుతో రైతు మృతి చెందడంతో ఆయన మృతి పట్ల తమ సంతాపం వ్యక్తం చేశారు.

దుకాణంలో చోరీ

అనంతపురం క్రైం, జూలై 22: నగరంలోని కొవూరునగర్‌లో ఓ దుకాణంలో చోరీ జరిగింది. జాతీయ రహదారి సమీపంలో శ్రీనివాసులు అనే వ్యక్తి జనరల్‌స్టోర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి దొంగలు షట్టర్ తాళాలు పగలగొట్టి దుకాణంలోని క్యాష్‌కౌంటర్‌లోని రూ.18వేల నగదు, చాక్లెట్లు, సిగరెట్లు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తమ్ముడి నుంచి ప్రాణహాని

● అతడిని ఊరి నుంచి బహిష్కరించండి

● ఎస్పీకి మహిళ వినతి

అనంతపురం క్రైం, జూలై 22: తనకు, కుమార్తె, అల్లుడికి తమ్ముడి నుంచి ప్రాణహాని ఉందని, ఇదివరకే గొడ్డలితో నరికిన అతన్ని ఊరి నుంచి బహిష్కరించాలని మహబూబ్‌బీ అనే మహిళ ఎస్పీ కేవీ మురళీకృష్ణను కోరారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాస్పందనలో ఎస్పీని కలిసి అర్జీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రికి చెందిన తాను 2021 మే 17న కుమార్తెను పెనకచెర్ల డ్యాంకు చెందిన అబ్దుల్ రెహమాన్‌కు ఇచ్చి వివాహం చేశానన్నారు. ఏడుగురు సోదరులు, నలుగురు అక్కచెల్లెళ్లు కలిసి తనపై కుట్ర పన్ని భర్తతో విడాకులిప్పించే ప్రయత్నం చేశారన్నారు. ఈ ఏడాది జనవరి 1న కుమార్తె, అల్లుడుంటున్న ఇంటికి కరెంట్ షాక్ ఇచ్చారని ఆరోపించారు. ఈనెల 9న ఆస్తి అంతా తమకే స్వాధీనం చేయాలని, లేదంటే మిమ్మల్ని చంపి జైలు కెళ్తానని తమ్ముడు షేక్ జిలానీ బాషా గొడ్డలితో నరికాడన్నారు. కోర్టు అతనికి రిమాండ్ విధించిందన్నారు. భవిష్యత్తులో అతని నుంచి ప్రాణహాని ఉందని ఎస్పీకి విన్నవించినట్లు తెలిపారు. అతన్ని ఊరి నుంచి బహిష్కరించడంతో పాటు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల నుంచి ప్రాణరక్షణ కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న మహబూబ్‌బీ

25న హుండీ ఆదాయం లెక్కింపు

గుత్తి రూరల్, జూలై 22: మండలంలోని తొండపాడులో గల బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీన హుండీల ఆదాయం లెక్కింపును నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నాగేంద్రుడు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి నుంచి జూలై 24 వ తేదీ వరకు భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను లెక్కిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు లెక్కింపు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

పంచకలశాలకు ప్రత్యేక పూజలు

విడపనకల్లు, జూలై 22: మండలంలోని గడేకల్లు గ్రామంలో భీమలింగేశ్వర స్వామి రథోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం పంచ కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కలశాలను అర్చకులు పూలతో అలంకరించి రథంపై ఉంచి ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. అనంతరం వాటిని ఆలయంలోకి తీసుకొచ్చి పూజలు జరిపారు. గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

గుత్తి రూరల్, జూలై 22: మండలంలోని బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని టీబీ, ఎయిడ్స్ కుష్ఠు నిర్మూలన జిల్లా అధికారి అనుపమ జేమ్స్ సోమవారం తనిఖీ చేశారు. వైద్యులు, ఆశా వర్కర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యులు ప్రవీణ్ కుమార్, దేవేంద్ర నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం జిల్లా కో కన్వీనర్ ఎన్నిక

కణేకల్లు, జూలై 22 : రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కో కన్వీనర్‌గా శాంతకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో జిల్లా కన్వీనర్ భీమేష్ అధ్యక్షతన జరిగింది. విద్యార్థుల సమస్యల పరిష్కారం తమ సంఘం పాటు పడుతోందని వారు పేర్కొన్నారు. సంఘం నాయకులు రాజశేఖర్, రాజు, వంశీ, సాత్విక్, మురళి, భాస్కర్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కూడేరు, జూలై 22: మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో సోమవారం నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో, పయ్యావుల సోదరుల సహకారంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. వివిధ గ్రామాల నుంచి ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి వచ్చిన వారికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదర్‌చౌదరి భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ టీడీపీ సాధికార సమితి ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాల పోస్టర్ల విడుదల

గుంతకల్లు టౌన్, జూలై 22: పట్టణంలోని పాతగుంతకల్లులో వెలసిన సయ్యద్ హజరత్ మస్తాన్ వలి 389వ ఉరుసు ఉత్సవాల పోస్టర్లను దర్గాలో సోమవారం దర్గా డెవలప్‌మెంట్ కమిటీ వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రహీం, కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 31న గంధం, ఆగస్టు1న షంషీర్, 2న జియారత్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ధర్మకర్తలు బాబురెడ్డి, జీపీ తిమ్మారెడ్డి, జీపీ మంతకల్లురెడ్డి, కమిటీ అధ్యక్షుడు సుంకన్న, కార్యదర్శి పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి

పెద్దపప్పూరు, జూలై 22: మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గల సచివాలయాల్లో ఈనెల 23నుంచి 27వ తేదీ వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎంపీడీఓ కవిత సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులు చేయదలచిన వారు, పిల్లలకు కొత్త ఆధార్‌ను చేయించేవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుందుర్పి: ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. ఈ నెల 23న కుందుర్పి-1, మలయనూరు-1 గ్రామ సచివాలయాల్లో, 24న కుందుర్పి-2, మలయనూరు-2, 25న ఎర్రగుంట, ఎనుముల దొడ్డి-1, 26న బసాపురం, ఎనుముల దొడ్డి -2, 27న నిజవళ్లి, మహంతపురం గ్రామ సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

యల్లనూరు, జూలై 22: మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులుపై సోమవారం పోక్సో కేసు నమోదుచేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. చిలమకూరు గ్రామంలోని ఆదర్శపాఠశాల సమీపంలో ఓ ఇంటిలో ఉంటున్న మైనర్ బాలికపై రామాంజనేయులు అసభ్యంగా ప్రవర్తించాడని, ఈ మేరకు బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేశామని సీఐ చెప్పారు.

ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

రాయదుర్గం రూరల్, జూలై 22: మండలంలోని కెంచానపల్లికి చెందిన ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈనెల 18వ తేదీన మొహరం వేడుకల్లో భాగంగా ఎస్సీలు, బీసీల మధ్య గొడవలు జరిగాయి. దీంతో గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, ఆది, రామాంజనేయులుతో పాటు మరో ముగ్గురుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సీ వర్గం ఫిర్యాదు మేరకు ఆ ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

భజన పోటీల విజేత శంకరాపురం బృందం

బెళుగుప్ప, జూలై 22 : మండలంలోని నక్కలపల్లి షిర్డీసాయి ఆలయం వద్ద గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించామని, 16 భజన బృందాలు పాల్గొన్నాయని గ్రామస్థులు సోమవారం తెలిపారు. శంకరాపురం భజన బృందం మొదటి విజేతగా నిలిచి రూ. 25 వేల నగదు బహుమతిని దక్కించుకుందని చెప్పారు. రెండో బహుమతి కింద రూ. 20 వేలను గుర్రపాడు బృందం, మూడో బహుమతి కింద రూ.18 వేలను నార్పల వెంకటంపల్లి బృందం దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీని విజయవంతం చేయండి

గుత్తి, జూలై 22: ఉరవకొండ పట్టణంలో ఆగస్టు 6,7వ తేదీలలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ జరగనందని, విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక సాయి జూనియర్ కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరించారు. పలువురు మాట్లాడుతూ ప్లీనరీలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలు చర్చించి, వాటి పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తారన్నారు. 6న బహిరంగ సభ, భారీ ర్యాలీ, 7న ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు రమేష్ ,నాయకులు బాలు, ధన, ఈశ్వర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు

కుందుర్పి, జూలై 22: మండలంలోని కేజీబీవీలో విద్యార్థినులకు వైద్యాధికారి డాక్టర్ అనూష వైద్య పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్, గ్రూపింగ్ రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం రక్తహీనతకు కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. పాఠశాల సిబ్బంది నిర్మల, శశికళ, ఏఎన్‌ఎం సుధాలక్ష్మీ పాల్గొన్నారు.



గుత్తి రైల్వే డీజిల్ షెడ్ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

● గుత్తి రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ పిలుపు

గుత్తి, జూలై 22: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పట్టణంలోని రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ పిలుపునిచ్చారు. స్థానిక రైల్వే డీజిల్ షెడ్ ఆవరణలో సోమవారం అటవీ అధికారుల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రమోద్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలంటే విధిగా మొక్కలు నాటాలని తెలిపారు. చెట్లుంటే వర్షాలు బాగా కురుస్తాయని, మానవ మనుగడకు ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు. అనంతరం రైల్వేషెడ్ కార్మికులతో కలిసి 500మొక్కలు నాటారు. కార్యక్రమంలో రైల్వే ఎస్ఎస్‌సీ జనరల్ మనోజ్, ప్రభుదాస్, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి సూచించారు. మండలంలోని పాతకొత్తచెరువులో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అప్పు డే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, టీడీపీ మండల కన్వీనర్ గోపాల్, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మాజీ ఎంపీపీ రాయల రామయ్య, నాయకులు గుమ్మనూరు వెంకటేష్ పాల్గొన్నారు.

విఠోబాస్వామికి అశ్వ వాహన సేవ



అశ్వ వాహనంపై ఊరేగుతున్న విఠోబాస్వామి

పామిడి, జూలై 22 : పట్టణంలోని రంగసుబేఫిర్కా భగవాన్ దాస్ విఠోబాస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం స్వామి వారికి అర్చకులు పలు అభిషేకాలు, అర్చనలు, హోమాలు, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన అశ్వ వాహనంపై విఠోబస్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి మంగళవాయిద్యాల నడుమ భజనలు చేస్తూ పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చున్నారు. వసంతోత్సవం జరుపుకున్నారు.

చంద్రబాబు, పవన్ ఫొటోలను ఏర్పాటు చేయాలి

గుంతకల్లు టౌన్, జూలై 22: గుంతకల్లు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలని జనసేన మండల అధ్యక్షుడు కురువ పురుషోత్తం సోమవారం ప్రకటనలో కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఫొటోలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలను ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 60రోజులు అయినా గుంతకల్లు మండల పరిధిలోని చాలా కార్యాలయాల్లో ఫొటోలు ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే ఏర్పాటు చేయాలన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

యల్లనూరు, జూలై 22: మండలకేంద్రంలో బోయ కులస్థుల శ్మశాన వాటిక కు మరింత స్థలం కేటాయించాలంటూ స్థానిక టీడీపీ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తహశీల్దార్ జయప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి దొడ్లో హనుమంతు మాట్లాడుతూ ఇక్కడ బోయ కులస్థులకు కేవలం 40సెంట్లలో మాత్రమే శ్మశాన వాటిక ఉందన్నారు. దీంతో వారు అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరింత స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వ స్థలం ఎక్కడైనా ఉంటే తక్షణమే గుర్తించాలంటూ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

ఖాళీగా తహసీల్దార్ కార్యాలయం

● అందుబాటులో లేని అధికారులు, సిబ్బంది ● ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజలు

కళ్యాణదుర్గం, జూలై 22: శెట్టూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సోమవారం ఖాళీగా దర్శనమిచ్చింది. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ సెలవుపై వెళ్లారు. కేవలం ఒక టైపిస్టు తప్ప ఎవరూ అందుబాటులో లేరు. దీంతో వివిధ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఖాళీ కుర్చీలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యయప్రయాసల కోర్చి కార్యాలయానికి వస్తే ఇక్కడ అధికారులు, సిబ్బంది ఎవరూ లేరని మండిపడ్డారు. సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని నిట్టూర్చారు. జిల్లా అధికారులు స్పందించి ఇక్కడి అధికారులను కార్యాలయంలో అందుబాటులో వుండే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

రేషన్ షాపుల సంఖ్య పెంచాలని వినతి

గుంతకల్లు టౌన్, జూలై 22: పట్టణంలో రేషన్ షాపుల సంఖ్యను పెంచాలని కోరుతూ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి సోమవారం బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్ మాట్లాడుతూ.. పట్టణంలో జనాభా, ఇళ్ల సంఖ్య, కాలనీలు పెరిగాయన్నారు. రేషన్ కోసం లబ్ధిదారులు కిలో మీటర్ల దూరం వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. అధికారులు వెంటనే రేషన్ షాపుల సంఖ్యను పెంచి వారి కష్టాలను తీర్చాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, సూర్యనారాయణ, జీఎం మహేష్, పద్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరేశ్వరుడిగా భోగేశ్వరుడు

పామిడి, జూలై 22: ఆషాఢ మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని భోగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే భోగేశ్వరస్వామికి, ప్రసన్న పార్వతీదేవికి పంచామృతాభిషేకాలు, ఏకవార రుద్రాభిషేకాలు చేశా రు. అలాగే కూరగాయలు, ఆకుకూరలు, పళ్లతో స్వామిని శాకంబరేశ్వరుడిగా, అమ్మవారిని శాకంబరేశ్వరిగా అలంకరించారు. తర్వాత అర్చనలు, విశేష పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మవారి దర్శనం చేసుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో భోగేశ్వరుడు

ఉద్యోగుల పట్ల
ఆదరాభిమానాలతో మెలగండి

గుంతకల్లు, జూలై22: కింది స్థాయి ఉద్యోగుల పట్ల ఆదరాభిమానాలతో మెలగాలని రైల్వే సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం ఆయన సీనియర్ సెక్షన్ ఇంజనీర్ల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గ్యాంగ్‌మన్ హరి ఓం ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో కింది స్థాయి ఉద్యోగుల కష్టాలను ఎరిగి వారి పట్ల సానుకూల దృక్పథంలో మెలగాలన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఐదుగురికి ఎంప్లాయీ ఆఫ్ ది మంత్ అవార్డులు..

డివిజన్‌లోని ఐదుగురు రైల్వే ఉద్యోగులకు సేఫ్టీ కేటగిరి కింద ఎంప్లాయి ఆఫ్ ది మంత్ జీఎం అవార్డును దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ అందజేశారు. జోనల్ కేంద్రమైన సికింద్రాబాద్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈ అవార్డులను అందజేశారు. ఆరు రైల్వే డివిజన్లలోని 8 మంది ఉద్యోగులకు ఈ అవార్డులు దక్కగా, వారిలో ఐదుగురు గుంతకల్లు డివిజన్‌కు చెందినవారుండటం గమనార్హం. రైళ్ల భద్రతా విషయంగా విధినిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించిన సిబ్బందికి ఈ అవార్డులను ప్రకటించినట్లు జీఎం తెలిపారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలు పంపిణీ

పెద్దపప్పూరు, జూలై22: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఫ్లోరోసిస్ బాధితులకు వాకర్లు, ఊతకర్రలు, నడుంబెల్ట్‌లు పంపిణీ చేసినట్లు వైద్యులు ఉషారాణి, తేజస్విని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ ఫీల్డ్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

బోరుబావి సీజ్

పుట్లూరు, జూలై 22: మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో అనుమతులు లేకుండా వారంరోజుల క్రితం వేసిన బోరుబావిని సోమవారం సీజ్‌చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరెడ్డి వారం క్రితం ఎలాంటి అనుమతులు లేకుండా బోరువేయించారు. ఈ బోరు నుంచి కోమటికుంట్ల గ్రామశివారులోని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తోటకు పైప్‌లైన్ వేసేందుకు గాడి తవ్వారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు వ్యక్తులు బోరుకు అనుమతులు లేవంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో సీఐ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ కిష్టప్ప, ఎస్ఐ హేమాద్రి, వీఆర్వో అంకన్న గ్రామానికి వెళ్లి బోరు బావిని సీజ్‌చేశారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటుచేశారు.

కోర్టులో ప్రధాన నిందితుడి హాజరు

రాయదుర్గం రూరల్, జూలై 22: మండలంలోని మెచ్చిరి గ్రామంలో టీడీపీ నాయకుడు ఆదెప్ప హత్యకేసులో ప్రధాన నిందితుడైన కేశవరెడ్డిని సోమవారం రాయదుర్గం కోర్టులో సివిల్ జడ్జి ఎదుట హాజరు పరచినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. హత్య కేసులో కేశవరెడ్డి రిమాండ్ ఖైదీగా ఉండడంతో పోలీసుల కస్టడి పూర్తయింది. దీంతో అతడిని జడ్జి ఎదుట హాజరుపరచడంతో సబ్ జైలుకు తరలించారు.

కిరాణా దుకాణాల తనిఖీ

బొమ్మనహాళ్, జూలై 22: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో గల కిరాణా దుకాణాలను సోమవారం రాత్రి తూనికలు, కొలతల శాఖఅనంతపురం ఇన్‌స్పెక్టర్ శంకర్ తనిఖీ చేశారు. హీరా కిరాణా దుకాణాన్ని తనిఖీ చేసి శ్రీగోల్డ్ పామాయిల్ ప్యాకెట్‌ను తూకం వేసి పరిశీలించారు. కిలోకు వంద గ్రాములు తక్కువ రావడంతో దుకాణ యాజమానికి రూ. 40 వేలు జరిమానా విధించారు. ఈ జరిమానాను ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఆదేశించారు. తూకాల్లో తేడాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

తమ్ముడి నుంచి ప్రాణహాని

● అతడిని ఊరి నుంచి బహిష్కరించండి

● ఎస్పీకి మహిళ వినతి

అనంతపురం క్రైం, జూలై 22: తనకు, కుమార్తె, అల్లుడికి తన తమ్ముడి నుంచి ప్రాణహాని ఉందని, ఇదివరకే గొడ్డలితో నరికిన అతన్ని ఊరి నుంచి బహిష్కరించాలని మహబూబ్‌బీ అనే మహిళ ఎస్పీ కేవీ మురళీకృష్ణను కోరారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాస్పందనలో ఎస్పీని కలిసి అర్జీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రికి చెందిన తాను 2021 మే 17న కుమార్తెను పెనకచెర్ల డ్యాంకు చెందిన అబ్దుల్ రెహమాన్‌కు ఇచ్చి వివాహం చేశానన్నారు. ఏడుగురు సోదరులు, నలుగురు అక్కచెల్లెళ్లు కలిసి తనపై కుట్ర పన్ని భర్తతో విడాకులిప్పించే ప్రయత్నం చేశారన్నారు. ఈ ఏడాది జనవరి 1న కుమార్తె, అల్లుడుంటున్న ఇంటికి కరెంట్ షాక్ ఇచ్చారని ఆరోపించారు. ఈనెల 9న ఆస్తి అంతా తమకే స్వాధీనం చేయాలని, లేదంటే మిమ్మల్ని చంపి జైలుకెళ్తానని తమ్ముడు షేక్ జిలానీ బాషా గొడ్డలితో నరికాడన్నారు. కోర్టు అతనికి రిమాండ్ విధించిందన్నారు. భవిష్యత్తులో అతని నుంచి ప్రాణహాని ఉందని ఎస్పీకి విన్నవించినట్లు తెలిపారు. అతన్ని ఊరి నుంచి బహిష్కరించడంతో పాటు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

తేలు కుట్టడంతో రైతు మృతి

కణేకల్లు, జూలై 22: మండల కేంద్రానికి చెందిన శర్మాస్(48) అనే రైతు తేలు కాటుతో మృతి చెందాడు. గ్రామ సమీపంలోని తన పొలంలో ఆదివారం ఆయన పని చేస్తుండగా తేలు కుట్టింది. అయితే శర్మాస్ దాని గురించి పెద్దగా పట్టించుకోలేదు. సోమవారం పొలంలో ఉన్నపలంగా స్పృహ కోల్పోయి కింద పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

'మాజీ సీఎంకు మతి భ్రమించింది'

పుట్లూరు, జూలై 22: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం కోల్పోవడంతో మతిభ్రమించిందని, అందుకే ఏదేదో మాట్లాడుతున్నారని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు విమర్శించారు. మండలంలోని కొండుగారికుంట గ్రామంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ వద్ద జగన్ ప్రజాస్వామ్యం ఎక్కడుందంటూ పోలీసులపై చిందులేయడం చూస్తుంటే మతిభ్రమించిందేమోనన్న అనుమానం కలుగుతోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం కనిపించలేదా అని ప్రశ్నించారు. భారీ ఓటమి చవిచూసిన తర్వాత మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా నీతిమంతమైన రాజకీయాలు చేయాలని హితవు పలికారు.

కేసీ నారాయణకు ఘన నివాళి



కళాశాలలో నివాళులర్పిస్తున్న కరెస్పాండెంట్, సిబ్బంది

గుంతకల్లు టౌన్, జూలై22: విద్యావేత్త, జిల్లాపరిషత్ మాజీ చైర్మన్, శ్రీ శంకరానంద గిరి స్వామి ఎడ్యుకేషనల్ సొసైటీ మాజీ కరెస్పాండెంట్ కేసీ నారాయణ ద్వితీయ వర్ధంతిని పట్టణంలోని శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల కరెస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరెస్పాండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేసీనారాయణ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు కల్పించారని గుర్తు చేశారు. అనంతరం స్థానిక అనాథాశ్రమంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు కేసీ నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్ర, ప్రకాష్‌రెడ్డి, బండారి శివ, బీఎస్ శ్రీధర్, కావలిచంద్రశేఖర్, కావలిభాస్కర్, వాల్మీకి సతీష్, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు వాల్మీకి రాము తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న లావణ్య

తాడిపత్రి, జూలై 22: మండలంలోని చిన్న పొలమడ గ్రామంలో పారిశుధ్యం పడకేసిందని, పరిశుభ్రతకు వెంటనే చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి లావణ్య సోమవారం ఎంపీడీఓ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సర్పంచు నిర్లక్ష్యం వల్ల అపరిశుభ్రతతో పాటు పలు సమస్యలు నెలకొన్నాయన్నారు. సర్పంచు గ్రామంలో ఏ ఒక్కరోజూ ఫాగింగ్ కానీ, కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడం కానీ చేయించలేదన్నారు. చెత్తసేకరించడానికి ఉన్న గ్రీన్ అంబాసిడర్స్‌ను సొంత పనులకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. గ్రామంలో ఎక్కడచూసినా చెత్తదిబ్బలు దర్శనమిస్తున్నాయన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజలు అనారోగ్యం బారిన పడక తప్పదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే తామే రంగంలోకి దిగి సొంత నిధులు వెచ్చించి అయినా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతామని ఆమె పేర్కొన్నారు.

విత్తన ప్రాసెసింగ్ యూనిట్ తనిఖీ

విడపనకల్లు, జూలై 22: మండలంలోని పాల్తూరు గ్రామంలో గల సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌లో నకిలీ విత్తనాలను తయారు చేస్తున్నట్లు అనుమానంగా ఉందని, చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ సోమవారం అనంతపురంలోని కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై జేడీఏ ఉమా మహేశ్వరమ్మ విచారణకు ఆదేశించటంతో ఏఓ పెన్నయ్య వెంటనే పాల్తూరుకు చేరుకుని సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గోడౌన్ పేరు రాయలసీమ హైబ్రీడ్ సీడ్స్ అని పెట్టారని, అయితే ఇక్కడ రైతులకు అందించే ఎలాంటి విత్తనాలను ప్రాసెసింగ్ చేయటం లేదని తేల్చారు. పశువుల మేతకు ఉపయోగించే గడ్డి విత్తనాల ప్రాసెసింగ్ జరుగుతోందన్నారు. దీనికి వ్యవసాయ శాఖ కమిషనర్ గుంటూరు వారి నుంచి అనుమతులు పొందారన్నారు. 2027వరకూ గడువు ఉంది అని తెలిపారు. సర్వే నంబరు 102-ఏ2, హావళిగి రోడ్డులో ఈ సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ ఉందన్నారు. దీనిలో పశువులకు మేతకు ఉపయోగించే జొన్న గడ్డి విత్తనాలు, మొక్క జొన్న విత్తనాలు మాత్రమే ప్రాసెసింగ్ చేసి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులకు అందిస్తారని చెప్పారు. ఏమైనా తేడాలు ఉన్నాయా అని రికార్డులన్నింటినీ పరిశీలించారు. ప్యాకింగ్ చేసిన గడ్డి విత్తనాలను పరిశీలించి నివేదికలను జిల్లా అధికారులకు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం రూరల్, జూలై 22: మండలంలోని పశువుల షెడ్ల నిర్మాణానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని 19 పంచాయతీలకు మినీగోకులం, సన్నజీవాల షెడ్లు, కోళ్ల షెడ్లు మంజూరైనట్లు చెప్పారు. మండలానికి 50 షెడ్లు మంజూరు కాగా అందులో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం కేటాయించామన్నారు. మరిన్ని వివరాల కోసం తమను సంప్రదించాలని సూచించారు.

దొంగ అరెస్టు

బెళుగుప్ప, జూలై 22: మండలంలోని కాలువపల్లి తండా సమీపంలో ఉన్న సేవాలాల్ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున హుండీ పగులగొట్టి నగదును అపహరించిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. హనిమిరెడ్డి పల్లి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా తమిళనాడు రిజిస్ట్రేషన్ స్కూటీలో వెళుతున్న అతడిని అనుమానిత వ్యక్తిగా గుర్తించి విచారించామన్నారు. ధర్మవరానికి చెందిన షేక్ ఫయాజ్ కదిరిలో స్కూటీని అపహరించాడని, అలాగే కాలవపల్లి ఆలయంలో హుండీని పగులగొట్టి వేల రూపాయలు దొంగలించినట్లు తెలియడంతో అతడిని వెంటనే అరెస్టు చేశామన్నారు. అలాగే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు ధర్మవరం, కదిరి, శింగనమల తదితర ప్రాంతాల్లో పదికి పైగా దొంగతనం కేసులలో నిందితుడిగా ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు.

పంచాయతీ వార్డు సభ్యుడి మృతి

గుమ్మఘట్ట, జూలై 22: మండల కేంద్రంలో ఆరో వార్డు సభ్యుడు హరిజన హనుమంతప్ప అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ విజయలక్ష్మి, టీడీపీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, ఈఓఆర్డీ సురేష్, పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం దహన సంస్కారాల కోసం సర్పంచ్ రూ. ఐదు వేల ను కుటుంబసభ్యులకు అందించారు.

ప్రకటన

S.జాకీర్ బాషా S/o S.అమ్మున్ బాషా, గోనబావి,గుమ్మగట్ట మండలం, అనంతపురం జిల్లా. Doc.No.6893/2023, సర్వే నెం. 87C లో ఖాళీ స్థలంను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాయదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యం తరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజుల లోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించండి.
హద్దులు:తూర్పు:BTP రోడ్డు, పడమర:ఇదే సర్వే నెంబరులో నేను వదిలిన 15 అడుగుల రోడ్డు, ఉత్తరం:ప్లాట్‌నెం. 1లో నాయొక్క మిగులు ప్లాటు, దక్షిణం:ప్లాట్ నెంబరు. 2.

K.మల్లికార్జున, అడ్వకేట్, కళ్యాణదుర్గం

ప్రకటన

ఉమాపతి S/o Late కురుబ బళ్ళారి తిప్పేస్వామి, శాంతినగర్, రాయదుర్గం, అనంతపురం జిల్లా. Doc.No.1942/2008, సర్వే నెం. 146/2 లో ఇల్లును శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాయదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజుల లోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించండి.
హద్దులు:తూర్పు:రోడ్డు, పడమర:ఇదే డోర్ నెం ఇంటి పైకి నా యొక్క మిగులు ఇల్లు, ఉత్తరం:నాయకుల సిద్దమ్మ వగైరాల స్థలం, దక్షిణం:కురుబ లక్ష్మీదేవి గారి ఇల్లు.

K.మల్లికార్జున, అడ్వకేట్, కళ్యాణదుర్గం

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

బెళుగుప్ప, జూలై 22 : ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు తగ్గుపర్తి చందు కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ వసతి గృహాలను సోమవారం ఆయన సందర్శించారు. మండలంలోని వెంకటాద్రిపల్లిలో బాలుర వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ హాస్టల్లో విద్యార్థులకు మౌలిక వసతులు సరిగా లేవని, కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గ నాయకులు సిద్దు, నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

పామిడి, జూలై 22 : పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్టాండ్ సమీపాన ఎంతో విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని వామపక్ష పార్టీల నాయకులు కే రహీం, అనిమిరెడ్డి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... నూతన ఆర్టీసీ బస్టాండ్ వద్ద సుమారు 71సెంట్ల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. అది ఆక్రమణకు గురవుతోందన్నారు. సర్వే చేయించి హద్దులు ఏర్పరచి స్వాధీనం చేసుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఉపయోగార్థం వినియోగించాలని తహసీల్దార్‌ను కోరారు. సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు జబ్బార్ బాషా, చౌడప్ప, శ్రీనివాసులు, వెంకటరమణ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్ ప్రారంభం

బొమ్మనహాళ్, జూలై 22: జాతీయ విద్యావిధానం 4వ వార్షికోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈఓ మల్లికార్జున, హెచ్‌ఎం రాజ్‌కుమార్ శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 28వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్‌ను నిర్వహి స్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిందని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు భాగస్వాములు కావాలని కోరారు.

నేలకూలిన చెట్టు

బొమ్మనహాళ్, జూలై 22 : మండలంలోని రామదాసప్ప తోట గ్రామం వద్ద బళ్లారి - కళ్యాణదుర్గం రహదారి పక్కన ఉన్న భారీ చెట్టు సోమవారం రాత్రి గాలికి నేలకొరిగింది. ఒక్కసారిగా పెద్దఎత్తున గాలి వీచడంతో చెట్టు నేలకొరిగింది. రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంకటేశులు, నాయకుడు గోపాల్ ఆ చెట్టును తొలగింప జేశారు.

గందరగోళం మధ్య వేలం పాట

ఉరవకొండ,జూలై22: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన ఆలయ ఆదాయ వనరుల వేలం పాట గందరగోళం మధ్య సాగింది. ఆలయ ఆవరణంలోని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, ఈవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తలనీలాలు, టెంకాయలు విక్రయించుకునే హక్కు, కొబ్బరిచిప్పల సేకరణకు వేలం పాట నిర్వహించారు. మొదట తలనీలాలకు వేలం చేపట్టగా 18మంది డిపాజిట్లు చెల్లించి పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువ పాడడంతో వాయిదా వేశారు. తరువాత టెంకాయల విక్రయించుకునే హక్కుకు వేలం నిర్వహించగా 26మంది పాల్గొన్నారు. గుంతకల్లుకు చెందిన రంగనాయకులు రూ.23.65లక్షలకు వేలం దక్కించుకున్నారు. కాగా వేలం దక్కించుకున్న వ్యక్తి నగదు మొత్తం అంతా ఇప్పుడే కట్టాలంటూ కొంతమంది వేలం పాటదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గందరగోళం ఏర్పడింది. టెండర్ దారులు, వేలం పాట దక్కించుకున్న వ్యక్తి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు వారికి సర్దిచెప్పారు. సాయంత్రం లోపు నగదు మొత్తం చెల్లించాలని అధికారులు వేలం దక్కించుకున్న వ్యక్తికి సూచించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. కొబ్బరి చిప్పల సేకరణ హక్కుకు నిర్వహించిన వేలం పాట, ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువ పాడడంతో వాయిదా వేశారు. టెండర్‌దారులు కుమ్మక్కు కావడంతోనే తలనీలాలు, కొబ్బరి చిప్పల సేకరణ వేలం వాయిదా పడినట్లు సమాచారం.